సాక్షి
మహబూబాబాద్

బుధవారం | 12 | ఏప్రిల్ | 2023



విద్యార్థులకు రాష్ట్రపతి ప్రశంసలు

ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మేళాలో జిల్లా విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. కాగా వారిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభినందించారు. - 8లో▸



లాభదాయకం గొర్రెల పెంపకం

గొర్రెల పెంపకంతో రైతులు ఆర్థికంగా ఎదగవచ్చని కేవీకే శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గొర్రెల ఎంపిక, వసతి, పునరుత్పత్తి వంటి జాగ్రత్తలు వివరించారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.5^0 / 22.3^0

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఉదయం పదిగంటల తర్వాత ఉష్ణోగ్రతలు పెరిగి ఎండ తీవ్రత ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ 6:37	గురు 4:38

న్యూస్‌రీల్

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ



కురవి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని పరిశీలించారు. 128మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. మహిళలు ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఉమాగౌరి, డాక్టర్ విరాజిత, ఎంఎల్‌హెచ్‌పీ ఝాన్సీ, స్టాఫ్ నర్సులు కవిత, అనురాధ, వినోద, హెచ్‌ఈఓ గౌసుద్దీన్, ఏఎన్ఎం నసీమా, డీపీఓ రుక్ముద్దీన్, ఆశకార్యకర్తలు జ్యోతి, విజయ ఉన్నారు.

ఉపకరణాలకు దరఖాస్తు చేసుకోవాలి

- డీడబ్ల్యూఓ వరలక్ష్మి

మహబూబాబాద్: అర్హులైన దివ్యాంగులు ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని డీడబ్ల్యూఓ వరలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సంక్షేమశాఖ, తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో అంధులకు, మానసిక దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు అందజేస్తామన్నారు. ఇంటర్, ఆపై చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంబంధిత వెబ్‌సైట్‌లో ఈనెల 11నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

పిచ్చికుక్క దాడిలో మహిళకు తీవ్ర గాయాలు



దోర్నకల్: మండల కేంద్రం శివారు సోమ్లాతండాలో మంగళవారం పిచ్చికుక్క దాడిలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. తండాకు చెందిన వాంకుడోత్ విజయ తమ ఇంటిఎదుట మరో పాపతో నిల్చొని ఉండగా అకస్మాత్తుగా పిచ్చికుక్క దాడి చేసింది. పాప అక్కడి నుంచి పారిపోగా.. కుక్క విజయపై దాడి చేసి గాయపర్చింది. కాళ్లు, చేతులతో పాటు ఇతర శరీర భాగాలపై గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. గాయాలపాలైన విజయను అంబులెన్స్‌లో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

కవి సమ్మేళనం, వ్యాసరచన పోటీలు

మహబూబాబాద్: ఈ నెల 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని జిల్లా గ్రంథాలయంలో 12వ తేదీన కవి సమ్మేళనం, 13న వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కవులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కళాశాలస్థాయి విద్యార్థులకు అంబేడ్కర్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ



గార్ల: మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను మంగళవారం మహబూబాబాద్ డీఎస్పీ రమణబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలోకి వెళ్లేముందు డీఎస్పీ తన సెల్‌ఫోన్‌ను కానిస్టేబుల్ శ్రీనివాస్‌కు ఇచ్చి వెళ్లారు. డీఎస్పీ వెంట సీఐ బాలాజీ, ఎస్సై బానోత్ వెంకన్న, సిబ్బంది ఉన్నారు.

విస్త‘రణం’



మానుకోట పట్టణ రోడ్ల విస్తరణకు అడ్డంకులు

- కౌన్సిల్‌లో తీర్మానం చేసినప్పటికీ అదే తీరు
- మధ్యలో దళారులు, రాజకీయ నాయకుల దందా
- గతంలోనూ ఇదే తంతు.. ఇరుకుగా రోడ్లు



రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న పత్తిపాక రోడ్డు

సాక్షి, మహబూబాబాద్: గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా.. తెలంగాణ రాష్ట్ర సాధన తర్వాత జిల్లా కేంద్రంగా మారిన మానుకోటలో రోడ్లు మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదు. నిధులు మంజూరైనప్పటికీ రోడ్ల విసర్తణకు అడ్డంకులు ఎదురుకావడంతో పనులు ముందుకు సాగడం లేదు. దీంట్లో దళారులు, కొందరు రాజకీయ నాయకులు రంగప్రవేశం చేయడంతో ఆశించినస్థాయిలో పట్టణాన్ని అభివృద్ధి చేయలేకపోతున్నామని పట్టణ ప్రణాళిక అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముందుకు సాగని పనులు..

మానుకోట జిల్లా కేంద్రంగా మారిన తర్వాత పట్టణం విస్తరించింది. పట్టణంలోని ప్రధాన రహదారులపై వాహనాల రద్దీ కూడా పెరిగింది. దీనికి అనుగుణంగా రోడ్లు ఉండాలి. ఇందుకోసం నిధులు మంజూరు చేశారు. అయితే రోడ్ల వెడల్పు పనులు ఒక్క అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్నట్లుగా జరుగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని నెహ్రూసెంటర్ నుంచి మంగళికాలనీ వరకు పత్తిపాక రోడ్డులో 1.5కిలో మీటర్ల పొడవునా విస్తరణ పనులకు నిధులు కూడా కేటాయించారు. అయితే 80ఫీట్ల వెడల్పుతో ఈ రోడ్డు వేయాలని ముందుగా అధికారులు భావించారు. కాగా ఇలా చేస్తే చాలావరకు ఇళ్లు, షాపులు కూల్చివేయాల్సి వస్తుందని వ్యాపారులు, స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. పలు చర్చల అనంతరం 66ఫీట్ల వెడల్పుతో రోడ్డు వేయాలని, ఇందుకు అనుగుణంగా విస్తరణ చేయాలని మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేసి ఆమోదించారు. తీరా కూల్చివేతల సమయంలో స్థానికులు అడ్డుకుంటున్నారు. రోడ్డు వెడల్పును తగ్గించి పనులు చేపట్టాలని అంటున్నారు. దీనిని ఆసరాగా తీసుకొని కొందరు నాయకులు, దళారులు కలిసి రోడ్డు వెడల్పులో ఎక్కువ మొత్తంలో ఇళ్లు, స్థలాలు కోల్పోయే వారి వద్దకు వెళ్లి.. మేం దీనిని తగ్గిస్తామని చెబుతూ డబ్బులు వసూళ్లు చేస్తున్నట్లు ప్రచారం. అయితే ఎవరూ ఎన్ని ప్రయత్నాలు చేసినా 66ఫీట్ల రోడ్డును తగ్గించేది లేదని మున్సిపల్ అధికారులు తేల్చి చెబుతున్నారు.

మిగిలిన రోడ్ల పరిస్థితి..

మహబూబాబాద్ పట్టణంలోని ప్రధాన రహదారుల పరిస్థితి కూడా ఆశించిన స్థాయిలో వెడల్పునకు నోచుకోలేదనే విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా కోర్టు నుంచి కూరగాయల మార్కెట్, అండర్ బ్రిడ్జి వరకు కూడా 66 ఫీట్ల వెడల్పు చేయాలని మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం కూడా చేసింది. కానీ ఈ రోడ్డు 60 ఫీట్ల వెడల్పు మాత్రమే వేశారు. అదే విధంగా తహసీల్దార్ కార్యాలయం నుంచి నెహ్రూ సెంటర్ మీదుగా అండర్ గ్రౌండ్ వరకు కూడా 66 ఫీట్ల రోడ్డు వేయాలని ప్రతిపాదనలు చేశారు. కానీ ఈ రోడ్డు కూడా 60 ఫీట్లతోనే ముగిసింది. దీంతో ఈ రోడ్డు ఇరుకుగానే ఉంది. ప్రమాదాలు జరిగి పలువురు మృతి చెందిన సంఘటనలు కూడా ఉన్నాయి. అదేవిధంగా రైల్వేగేట్ నుంచి మదర్ థెరిస్సా స్టాచ్ వరకు, రైల్వే స్టేషన్ నుంచి కొత్త బస్టాండ్ వరకు ఉన్నరోడ్లు కూడా పట్టణాభివృద్ధికి అనుగుణంగా వెడల్పు చేయలేదు. దీంతో నిత్యం వేలాది మంది, వేలాది వాహనాలు వెళ్లే ఆ రోడ్లు కూడా ఇరుకుగా మారి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అయితే పట్టణంలో ఏ రోడ్డు వేసినా.. ఎక్కడ విస్తరణ పనులు జరిగినా.. పేదవాడి విషయంలో ఒక తీరుగా... ఆర్థిక, రాజకీయ నాయకుల అండ ఉన్నవారి విషయంలో అధికారులు మరో తీరుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇలా చేయడం వల్ల కొన్ని చోట్ల విశాలంగా.. మరికొన్ని చోట్ల రోడ్లు ఇరుకుగా మారాయి. అధికారులు ఇప్పుడు కూడా ఇదే తీరుగా వ్యవహరిస్తారో.. లేదా మున్సిపల్ కమిటీ తీర్మానం మేరకు పనులు చేపడుతారో వేచి చూడాలి.

మార్కెట్‌లో రైతుల ఆందోళన





ఏఎంసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు, రైతులతో మాట్లాడుతున్న ఎస్సైలు

- మిర్చి ధరల తగ్గింపుపై మండిపాటు

మహబూబాబాద్ రూరల్: మానుకోట వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధరల తగ్గింపుపై రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. వ్యాపారులు ధరలు తగ్గిస్తూ అన్యాయం చేస్తున్నారంటూ మండిపడ్డారు. మిర్చికి ఇతర మార్కెట్‌లలో అధిక ధర పలుకుతుండగా మానుకోటలో మాత్రం వ్యాపారులు తక్కువ ధర చెల్లిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు మార్కెట్ కార్యకలాపాలను స్తంభింపజేసి ఏఎంసీ కార్యాలయ భవనం ఎదుట రైతులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు బానోత్‌లింగ్యా, ధరావత్ రాజారాం, గుగులోతు లక్ష్మి మాట్లాడుతూ.. మిర్చి పంటకు మంచి ధర పెట్టి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఖమ్మం, వరంగల్ మార్కెట్‌లలో మిర్చి క్వింటాకు రూ. 24వేలు పలుకగా మానుకోటలో మాత్రం రూ.18వేల నుంచి రూ. 21వేల వరకు మాత్రమే ధర పెట్టి కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను దగా చేస్తున్నారని ఆరోపించారు. అకాల వర్షానికి పంటనష్టపోగా మిగిలిన కొంతమేరకు మిర్చిని విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకువస్తే తక్కువ ధరతో కొనుగోలు చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం, మార్కెటింగ్‌శాఖ అధికారులు స్పందించి రైతులను మోసం చేస్తున్న మిర్చి వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. రైతులు సమస్యను మార్కెట్ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్ దృష్టికి తీసుకెళ్లగా.. తాను నూతనంగా బాధ్యతలు చేపట్టానని, మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా వ్యాపారులతో మాట్లాడుతానన్నారు. మిర్చికి మంచి ధర చెల్లించి కొనుగోలు చేసేవిధంగా చూస్తానని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. కాగా తూకం పూర్తయి బస్తాలను వాహనాల్లో తరలిస్తుండగా రైతులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న మానుకోట టౌన్ ఎస్సైలు రవి, రామారావు, గోపి, పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడి వారిని శాంతిపజేశారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు

మహబూబాబాద్ అర్బన్: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని డీఈఓ రామారావు తెలిపారు. జిల్లాలో మంగళవారం జరిగిన సాంఘిక శాస్త్రం పరీక్షకు 20మంది గైర్హాజరైనట్లు తెలిపారు. అన్ని పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. సీఎస్ డీఓలు, సూపర్‌వైజర్లు, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్, పోలీస్ అధికారులు, సిబ్బంది పరీక్షలు ప్రశాంతంగా జరిగే విధంగా చర్యలు తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. నేడు జిల్లాలోని డోర్నకల్, కల్వల, కురవి, మహబూబాబాద్ మోడల్ స్కూల్, మరిపెడ, నర్సింహులపేట మోడల్ స్కూల్, నెల్లికుదురు, తొర్రూరు పాఠశాలల్లో ఒకేషనల్ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఉదయం 9.30నుంచి 11.30గంటల వరకు పరీక్ష ఉంటుందని, విద్యార్థులు సకాలంలో హాజరుకావాలన్నారు.



పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ శశాంక



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పెద్దవంగర మండలంలో ముందుగా ధాన్యం రానున్నందున కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా రైతులు భద్రపరుచుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు సిద్ధం చేసుకోవాలన్నారు. అవసరాలకు తగిన విధంగా గన్నీ సంచులు సిద్ధం చేసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీఓలు కొమురయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు చేయాలి..

ఈనెల 14న హైదరాబాద్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ వేడుకలో పాల్గొనేందుకు జిల్లా నుంచి వెళ్లే వారికి అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వెళ్లే వారికి చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 13న రాత్రి మండలాల్లో బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి బస్సులో 50మందికి పాస్‌లు ఇవ్వాలన్నారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం ఆకుకూరలతో భోజనం, సాయంత్రం స్నాక్స్, తిరుగు ప్రయాణంలో రాత్రివేళ భోజనం ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి బస్సులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ ఏర్పాటు చేయాలన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, డేవిడ్, అధికారులు ఉన్నారు.

గిఫ్ట్ ప్యాక్‌లు అందజేయాలి

ముస్లింలు రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకునేందుకు అధికారులు ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం రంజాన్ పండుగ నిర్వహణపై ముస్లిం మత పెద్దలు, అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలో నిరుపేద ముస్లింలకు గిఫ్ట్ ప్యాక్‌లు అందించాలన్నారు.

మహనీయుడు మహాత్మా జ్యోతిబా పూలే

- ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్
- ఘనంగా పూలే జయంతి వేడుకలు



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్ తదితరులు

మహబూబాబాద్ అర్బన్: అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిబా పూలే అని మానుకోట ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇల్లెందు బైపాస్ రోడ్డు, ఐఎంఏ హాల్‌లో పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే శంకర్ నాయక్, కలెక్టర్ శశాంక, అడిషనల్ ఎస్పీ చెన్నయ్య, బీసీ సంక్షేమశాఖ అధికారి నర్సింహస్వామి, పలు కుల, ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏప్రిల్ నెలంతా మహనీయుల పండుగలు జరపాలన్నారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత సీఎం కేసీఆర్ మహనీయుల జయంతులను అధికారికంగా నిర్వహిస్తున్నారన్నారు. చదువుకు కులం, మతం అడ్డుకాదని, అణగారిన వర్గాల అభివృద్ధికి సీఎం కృషి చేస్తున్నారన్నారు. జిల్లాలో బీసీ సంఘం భవనం కోసం ఎకరం స్థలం కేటాయించాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు. అనంతరం కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. విద్యతోనే సామాజిక రుగ్మతలు, అసమానతలను రూపుమాపవచ్చని గ్రహించి బాలికల విద్య కోసం పూలే దంపతులు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఎండీ. ఫరీద్, పలు సంఘాల నాయకులు కిషన్ నాయక్, భూపతి, సంజీవరావు ప్రభాకర్, వీరస్వామి, గోపి, రామ్మూర్తి, విజయలక్ష్మి, వేణు, శశి, రమేష్, మహేందర్, వీరన్న, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, వివిధ వసతి గృహాల వార్డెన్‌లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టాలి



రోడ్డు నిర్మాణం చేపట్టాల్సిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

దోర్నకల్: దోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులు చేపట్టాలని అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. రూ.25 కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనుల ప్రతిపాదనలు పరిశీలించేందుకు ఆమె మంగళవారం దోర్నకల్‌లో పర్యటించారు. ఈమేరకు బంకట్‌సింగ్‌తండా నుంచి ఎర్రమట్టితండా వరకు రోడ్డు నిర్మించనున్న ప్రాంతాలను పరిశీలించారు. అండర్ బ్రిడ్జి ప్రాంతంతో పాటు మున్సిపల్ కార్యాలయం నిర్మించాల్సిన ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీ ఇంజనీరింగ్ అధికారులు, పాలకవర్గంతో సమావేశమై ప్రతిపాదిత పనులపై చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రూ.25 కోట్లతో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల ప్రతిపాదనలు మాత్రమే సిద్ధమయ్యాయని, వీటిలో కొన్ని ప్రతిపాదనలు తొలగించి కొత్త పనులు చేర్చే అవకాశం ఉందన్నారు. డ్రెయినేజీ, రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్‌కుమార్, డీఈ నవీన్, మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, డీఈ భద్రునాయక్, ఏఈ హార్థిక, వైస్ చైర్మన్ కోటిలింగం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తాత్కాలిక రైల్వే లైన్ పనుల అడ్డగింత



పనులను అడ్డుకున్న భూ నిర్వాసితులు

గార్ల: మండల సమీపంలో చేపడుతున్న తాత్కాలిక మూడో రైల్వేలైన్ నిర్మాణ పనులను భూనిర్వాసితులు మంగళవారం అడ్డుకున్నారు. రైల్వే ట్రాక్ కింద నుంచి సీతారామ ప్రాజెక్ట్ కాల్వల నిర్మాణం చేపడుతున్నారు. ఈమేరకు పక్కన ఉన్న వ్యవసాయ భూముల నుంచి తాత్కాలిక రైల్వేలైన్ వేస్తుండగా.. తమకు నష్టపరిహారం చెల్లించాలని భూనిర్వాసితులు పనులను అడ్డుకున్నారు. దీంతో రైల్వే అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాసరావు, భూనిర్వాసితులు లోకేశ్వరరావు, హరి, వెంకటేశ్వర్లు, తేజ్యా తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణకు కృషి



ఆస్పత్రిలో మహిళలకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తొర్రూరు: మహిళల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మురళీధర్ అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా 82 మంది మహిళలకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. మహిళలకు పరీక్షలు విధిగా నిర్వహించాలని, రుగ్మతలను గుర్తించి మెరుగైన చికిత్సకోసం పెద్ద ఆస్పత్రులకు రెఫర్ చేయాలన్నారు. ఆరోగ్య మహిళ కార్యక్రమంలో 8రకాల చికిత్సలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రత్యేక అవసరాలున్న వారికి మందులు అందజేయడంతో పాటు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి మీరాజ్, వైద్యులు నందన, ప్రియాంక, ఫాతిమా, జయమణి, అనంతలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీతోనే తెలంగాణకు విముక్తి



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు సుధాకర్

తొర్రూరు: ముఖ్యమంత్రి కేసీఆర్ చేతిలో బందీగా మారిన తెలంగాణకు బీజేపీతోనే విముక్తి లభిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కట్టా సుధాకర్ అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15న వరంగల్‌లో నిర్వహించే నిరుద్యోగ మార్చ్‌కు అధిక సంఖ్యలో యువత, పార్టీ కార్యకర్తలు తరలిరావాలన్నారు. కేంద్రంలో మరోమారు బీజేపీనే అధికారంలోకి వస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు పెదగాని సోమయ్య, అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్, నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, నాయకులు లేగా రామ్మోహన్‌రెడ్డి, పాకనాటి దామోదర్‌రెడ్డి, రంగు రాములు, రామ్మోహన్ రెడ్డి, రచ్చ కుమార్, కొలుపుల శంకర్, సురేష్, యాకయ్య, రాజేష్ పాల్గొన్నారు.

కిరాణ దుకాణంలో టెన్త్ సమాధాన పత్రాల తూకం



టెన్త్ సమాధాన పత్రాలను ప్రైవేటు కిరాణ దుకాణంలో కాంటా వేయిస్తున్న అధికారులు

గార్ల: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు రాసిన సమాధాన పత్రాలను కిరాణదుకాణంలో తూకం వేసి పోస్టాఫీసుకు తరలించారు. మంగళవారం గార్ల బాలికోన్నత పాఠశాల కేంద్రంలో నిర్వహించిన 10వ తరగతి చివరి పరీక్ష సాంఘికశాస్త్రం సమాధాన పత్రాలను కిరాణ దుకాణంలో అధికారులు తూకం వేసుకొని పోస్టాఫీస్‌కు తీసుకెళ్లి పోస్టు మాస్టర్‌కు అప్పగించారు. 10వ తరగతి పరీక్షల సమాధాన పత్రాలన్నీ అధికారులు రోజూ కిరాణం దుకాణంలో కాంటా వేసి పోస్టాఫీస్‌కు తీసుకెళ్తున్నారు. దీనిపై పోస్టుమాస్టర్ నాగరాజు మాట్లాడుతూ.. పోస్టాఫీస్‌లో 2 కేజీల బరువు వరకే తూకం ఉందని తెలిపారు. దీంతో పరీక్షల నిర్వాహకులు సమాధాన పత్రాలను బయట దుకాణంలో తూకం వేయించుకొని వస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా పోస్టల్‌శాఖ అధికారులకు 20 కేజీల తూకం కావాలని కోరగా, మంగళవారం ఖమ్మం నుంచి కంప్యూటర్ కాంటాను పంపించారని పోస్టుమాస్టర్ చెప్పారు. ఒకవైపు ప్రశ్నపత్రాల లీకేజీలు, సమాధానపత్రాల బండిల్‌మాయం ఘటనలు చోటుచేసుకున్న ఈ సమయంలో ఇలా తూకం వేసి తరలించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వార్డెన్ సస్పెన్షన్

గూడూరు: మండలంలోని మట్టెవాడ ఎస్టీ బాలుర వసతి గృహం వార్డెన్ సురేందర్‌ను ఐటీడీఏ పీఓ అంకిత్ ఆదేశాల మేరకు డీడీ ఎర్రయ్య సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం మట్టెవాడలో ఎస్టీ బాలుర హాస్టల్‌కు చెందిన విద్యార్థి వాసం వర్షిత్‌కుమార్ గ్రామంలో ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో మృతి చెందిన విషయం తెలిసిందే. హాస్టల్‌కు చెందిన విద్యార్థి సైకిల్‌పై తిరగడం, అతడి మృతికి బాధ్యుడిని చేస్తూ వార్డెన్‌ను సస్పెండ్ చేశారు. కాగా సస్పెన్షన్ ఉత్తర్వులు తనకు అందినట్లు వార్డెన్ సురేందర్ తెలిపారు.

13న ఆచార్య జనార్దన్‌రావు మెమోరియల్ లెక్చర్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం పూర్వ ఆచార్యులు, దివంగత బియ్యాల జనార్దన్‌రావు 21వ మెమోరియల్ లెక్చర్‌ను ఈనెల 13న ఉదయం 11గంటలకు క్యాంపస్‌లోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించనున్నారు. రామన్ మెగాసెస్ అవార్డు గ్రహీత, పద్మశ్రీ శాంతిసిన్హా పాల్గొని ‘ఇన్‌స్టిట్యూషన్ బిల్డింగ్ అండ్ డెమోక్రసీ ఇన్ ఇండియా చాలెంజెస్’ అనే అంశంపై స్మారకోపన్యాసం చేస్తారని జనార్దన్‌రావు మెమోరియల్ ఫౌండేషన్ సెక్రటరీ రేవతి తెలిపారు. కార్యక్రమానికి కాకతీయ యూనివర్సిటీ వీసీ తాటికొండ రమేశ్ అధ్యక్షత వహిస్తారు.

లాభదాయకం గొర్రెల పెంపకం

● మాంసానికి పెరుగుతున్న డిమాండ్‌
● జాగ్రత్తలు తీసుకుంటే సమస్యలు రావని సూచిస్తున్న శాస్త్రవేత్తలు





మామునూరు కేవీకేలో పెంచుతున్న గొర్రెలు (ఇన్‌సెట్‌) విత్తన పొట్టేళ్లు

కరీమాబాద్‌: రోజురోజుకు మాంసానికి డిమాండ్‌ పెరుగుతున్న నేపథ్యంలో గొర్రెల పెంపకం లాభదాయకంగా మారనుంది. వ్యవసాయం చేస్తున్నట్లు, కోళ్ల ఫాంలు పెట్టినట్లుగానే గొర్రెల పెంపకం కూడా చేపట్టినట్లయితే రైతులకు ఆర్థికంగా ఎంతో ఉపయోగకరంగా మారుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గొర్రెల ఎంపిక, వసతి, పునరుత్పత్తి, ఆరోగ్య సంరక్షణ లాంటి జాగ్రత్తలు తీసుకున్నట్లయితే సమస్యలు రావని పేర్కొంటున్నారు.

పొట్టేళ్ల ఎంపిక కీలకం..

గొర్రెల పెంపకంలో పొట్టేళ్ల ఎంపిక కీలకంగా మారనుంది. గొర్రెల మంద పునరుత్పత్తిలో భాగంగా 'విత్తన' పొట్టేళ్ల పాత్ర ఎంతో ఉంటుంది. ప్రతీ ఆడ గొర్రె నుంచి సంవత్సరానికి 1 లేదా 2 కన్న ఎక్కువ పిల్లలు లభించవు. అదే విత్తన పొట్టేలుతో 50 నుంచి 75 వరకు పొందవచ్చు. అందుకే 'ఒక' విత్తన పొట్టేలు మందలో 'సగం' అంటారు. కనీసం 18 నెలల విత్తన పొట్టేలు ఎంపిక చేసుకోవాలి. వాటిని 2, 3 సంవత్సరాలకు ఒకసారి మార్చి కొత్త వాటిని తెచ్చి మందలో కలిపినట్లయితే ఆరోగ్యవంతమైన గొర్రెపిల్లలు పుడుతాయి.

వ్యాధులు.. ఆరోగ్య పరిరక్షణ

సహజంగా గొర్రెలకు వ్యాధి నిరోధక శక్తి చాలా తక్కువగా ఉంటుంది. గొర్రెల్లో ఎక్కువగా నీలి నాలుక వ్యాధి, చిటుక్కు రోగం, కాలి పుండ్ల వ్యాధి, బొబ్బ రోగం, గాలి కుంటు వ్యాధి తదితర వ్యాధులు వస్తుంటాయి. అవి వ్యాప్తి చెందకుండా పాకలో తేమ లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలి. సాయంత్రం వేప ఆకుతో పొగ వేయాలి. ఈ క్రమంలోనే గోమారులు రాకుండా పాకల్లో సుమథియాన్‌, మలాథియాన్‌ మందులు పిచికారీ చేయాలి. అంతే కాకుండా ప్రతీ 15 రోజులకు ఒకసారి పాకలో పొడి సున్నం చల్లాలి. సంవత్సరంలో కనీసం 3 సార్లు నట్టల నివారణ మందులను తగిన మోతాదులో తాగించాలి.

గొర్రెల్లో పునరుత్పత్తి..

గొర్రెల పెంపకం దారులు విత్తన పొట్టేలును ఎక్కువ రోజులు మందలో ఉంచకూడదు. రాత్రి పూట మాత్రమే మందలో జత కలపాలి. ఈ క్రమంలోనే పునరుత్పత్తి సక్రమంగా జరగాలంటే ప్రతీ 100 ఆడ గొర్రెలకు 3 విత్తన పొట్టేళ్లను అందుబాటులో ఉంచాలి. ఆడ గొర్రెలకు మినరల్‌ మిక్చర్‌ను క్రమం తప్పకుండా వాడినట్లయితే ఎదకొచ్చి చూడి నిలవడానికి అవకాశం ఉంటుంది.

పాకల నిర్మాణం..

గొర్రెల పెంపకందారులు పాకల నిర్మాణంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దు. ఖర్చుకు వెనకాడకుండా వాతావరణంలో వస్తున్న మార్పులకనుగుణంగా పాకలు నిర్మించుకోవాలి. గొర్రెలు సులువుగా తిరగడమే కాకుండా విశ్రాంతి తీసుకోవడానికి అనువుగా గాలి, వెలుతురు లభించేలా చూసుకోవాలి.

జాగ్రత్తలు పాటించాలి



గొర్రెల పెంపకంపై ఆసక్తి ఉన్న వారు జాగ్రత్తలు పాటిస్తూ పెంచడం ద్వారా లాభాలు పొందవచ్చు. పిల్లల దశ నుంచి వాటి ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వ్యాధులను బట్టి మందులు వాడుతూ ఉండాలి. ముఖ్యంగా పాక శుభ్రంగా ఉంచుకోవాలి. సరైన విత్తన పొట్టేలును ఎంపిక చేసుకోవాలి.

-డాక్టర్‌ రాజన్న, ప్రధాన శాస్త్రవేత్త, కేవీకే మామునూరు

విద్యార్థులకు రాష్ట్రపతి ప్రశంసలు



విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్రపతి

మహబూబాబాద్‌ అర్బన్‌: విద్యార్థులను పరిశోధనల వైపు ప్రోత్సహిస్తూ సామాజిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కేంద్రం నిర్వహిస్తున్న విజ్ఞాన మేళ పోటీల్లో మానుకోట జిల్లా విద్యార్థులు పాల్గొని సత్తా చాటుతున్నారు. జాతీయ స్థాయిలో ఇన్‌స్పైర్‌ మేళాలో మానుకోట జిల్లా విద్యార్థులు ఎడ్ల నాని, నక్క భవానీల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఎన్‌ఐఎఫ్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనలను సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. తెలంగాణ నుంచి ఎంపికైన 8 ప్రదర్శనలను రాష్ట్రపతి తిలకించి ప్రత్యేకంగా విద్యార్థులతో మాట్లాడి వారు ప్రదర్శించిన ప్రదర్శనల గురించి అడిగి తెలుసుకుని అభినంధించారు. దేశవ్యాప్తంగా 60 మంది విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొనగా తెలంగాణ నుంచి 8 మంది విద్యార్థులు హాజరు కాగా, మానుకోట జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొని తమ ప్రతిభ చాటుతున్నారు. పెద్దవంగర ప్రభుత్వ పాఠశాలలో నాని 9వ తరగతి, మోడల్‌ స్కూల్‌లో నక్క భవాని 10వ తరగతి వరకు చదువుకుంది. భవాని ప్రస్తుతం ఇంటర్‌ ద్వితీయ సంవత్సరం నేరడ మోడల్‌ స్కూల్‌లో పూర్తి చేసింది. కాగా అత్యంత ప్రతిభ కనబర్చిన విద్యార్థులను,గైడ్‌ టీచర్లను మంగళవారం కలెక్టర్‌ కె. శశాంక అభినందించారు.

క్లుప్తంగా

నేటి నుంచి దూరవిద్య పీజీ పరీక్షలు

కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నేటి నుంచి (12వ తేదీ) పీజీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్‌ నరేందర్‌ మంగళవారం తెలిపారు. పీజీ ప్రథమ సంవత్సరం పరీక్షలు ఈనెల 12, 15, 18, 20, 24 తేదీల్లో పరీక్షలు జరుగనున్నాయి. ఫైనల్‌ ఇయర్‌ విద్యార్థులకు ఈనెల 13, 17, 19, 21, 25 తేదీల్లో పరీక్షలు జరుగనున్నాయి. ప్రథమ సంవత్సరంలో 2,825, ద్వితీయ సంవత్సరంలో 2,154 మంది, మొత్తం 4,971మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు వారు తెలిపారు. యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో 5, ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో 5, ఖమ్మం జిల్లా కేంద్రం ఒకటి మొత్తం 11 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. పరీక్షలు ఆయా తేదీల్లో టైం టేబుల్‌ ప్రకారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకు జరుగుతాయన్నారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక చీఫ్‌ సూపరింటెండెంట్‌ పాటు, ఒక అబ్జర్వర్‌, రెండు ఫ్లయింగ్‌ స్క్వాడ్‌లను నియమించారు. విద్యార్థులు కేయూ వెబ్‌సైట్‌ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్‌ చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. ప్రశ్న పత్రాలను ఆన్‌లైన్‌లోనే పరీక్ష కేంద్రాలకు కొద్ది సమయం ముందు పంపుతారన్నారు.

ఎల్లంబజార్‌లో చైన్‌స్నాచింగ్‌

రామన్నపేట: వరంగల్‌ మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని ఎల్లంబజార్‌లో ఓ మహిళ మెడలో నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు మూడు తులాల బంగారం గొలుసును ఎత్తుకెళ్లిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎల్లంబజార్‌కు చెందిన దీపలక్ష్మి అనే మహిళ రాత్రి సమయంలో ఇంటి ముందు వాకింగ్‌ చేస్తున్న విషయాన్ని గమనించిన సదరు దుండగులు ఆకస్మాత్తుగా అటువైపుగా వాహనంపై వచ్చి మెడలో నుంచి బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఖిలా వరంగల్‌: మతవిద్వేశాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్న వీహెచ్‌పీ నేత కేశవ రాజ్‌ జీపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్‌ ముస్క శ్రీనివాస్‌ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రంగశాయిపేట మహంకాళి దేవాలయం ప్రాంగణంలో మంగళవారం వీహెచ్‌పీ నేత కేశవరాజ్‌ ఇతరులతో మతవిద్వేశాలను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తూ, హిందూ మతాన్ని రక్షించాలని మాట్లాడినట్లు ఎస్సై కుమార్‌ ఫిర్యాదు చేశారని, ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్‌ తెలిపారు.

మమ్మీ.. డాడీ ఐయామ్‌ సారీ..

● ఉరేసుకుని ఇంటర్‌ విద్యార్థి ఆత్మహత్య
● ఎంబీబీఎస్‌ సీటు రాదేమోనని అఘాయిత్యం



కృష్ణ(ఫైల్‌)



కృష్ణ రాసిన సూసైడ్‌ నోట్‌

కేసముద్రం: 'మమ్మీ, డాడీ ఐయామ్‌ సారీ... నాకు ఎంబీబీఎస్‌ సీటు రాదెమోనని అనిపిస్తుంది'అని సూసైడ్‌ నోట్‌ రాసిన ఓ ఇంటర్‌ విద్యార్థి ఇంట్లో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్‌ జిల్లా కేసముద్రం మండలం పీక్లాతండాజీపీ శివారు బోడగుట్టతండాలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం..తండాకు చెందిన గుగులోతు లచ్చు, జ్యోతి దంపతులకు ఒక కూతురు, ఇద్దరు కుమారులున్నారు. పెద్దకుమారుడు కృష్ణ(19) ఏటూరు నాగారంలోని ట్రైబల్‌ వెల్ఫేర్‌ కాలేజీలో ఇంటర్మీడియట్‌(బైపీసీ) చదివి, ఇటీవల పరీక్షలు రాసి ఇంటికి వచ్చాడు. ఎంబీబీఎస్‌ సీటు సాధించాలనే లక్ష్యం ఉన్న కృష్ణ, ఇంట్లో గోడలపై ఎంబీబీఎస్‌ నా డ్రీమ్‌ అంటూ రాసుకున్నాడు. ఈ మేరకు నీట్‌ ఎంట్రన్స్‌ ఎగ్జామ్‌కు ప్రిపేర్‌ అవుతున్నాడు. ఈక్రమంలో తల్లి పంటచేను వద్దకు వెళ్లగా, తండ్రి కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి అమ్మేందుకు వెళ్లాడు. తమ్ముడు ప్రభాకర్‌ పదవ తరగతి పరీక్ష రాసేందుకు కల్వల మోడల్‌ స్కూల్‌కి వెళ్లాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న కృష్ణ, తనకు ఎంబీబీఎస్‌ సీటు రాదెమోనని మనస్తాపం చెంది, ఐయామ్‌ సారీ మమ్మి, డాడీ అంటూ సూసైడ్‌ నోట్‌ రాసి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని తాత ఇంట్లోకి వచ్చి చూడగా ఉరివేసుకుని కనిపించాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఇంటికి చేరుకుని, కొడుకు మృతదేహంపై పడి కన్నీరుమున్నీరుగా విలపించారు. సంఘటన స్థలాన్ని ఎస్సై పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్‌కు ప్రజలే బలగం

● అభివృద్ధిని చూసి ఆదరించాలి
● మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



ఉషాదయాకర్‌తో కలిసి నృత్యం చేస్తున్న దయాకర్‌రావు

పాలకుర్తి: బీఆర్‌ఎస్‌కు ప్రజలే బలగం.. కార్యకర్తలే బలమని, దేశంలో ఏ పార్టీకి లేనంత 80 లక్షల కార్యకర్తల బలగం మనదని రాష్ట్ర పంచాయతీరాజ్‌ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని వావిలాల, ముత్తారం గ్రామాల్లో బీఆర్‌ఎస్‌ ఆత్మీయ సమ్మేళనం చేపట్టారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా స్థానికులు ఎద్దుల బండిపై ఊరేగింపు.. డప్పు చప్పులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి, ఎర్రబెల్లి చారిటబుల్‌ చైర్‌ పర్సన్‌ ఉషా దయాకర్‌రావుతో కలిసి మంత్రి దయాకర్‌ రావు ప్రసంగించారు. పార్టీ బలోపేతం, పటిష్టకు చేపట్టే ఆత్మీయ సమ్మేళనంలో ప్రతి ఒక్కరిని కలుపుకొని ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించాలన్నారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వాన్ని బద్నాం చేసే పనిలో బీజేపీ ఉందని, కాంగ్రెస్‌ బీజేపీ వంత పాడుతుందన్నారు. నియోజకవర్గంలో ఒక్కో గ్రామ పంచాయతీలకు కోటిన్నర నుంచి రెండున్నర కోట్ల మేర ఖర్చు చేసి నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడుపుతున్నామన్నారు. బీఆర్‌ఎస్‌ చేసిన అభివృద్ధిని చూసి పార్టీని మళ్లీ ఆదరించాలని కోరారు. అనంతరం దయాకర్‌రావు దంపతులు కార్యకర్తలతో కలిసి నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, జెడ్పీటీసీ పూస్కూరి శ్రీనివాస్‌రావు, మండల అధ్యక్షుడు పసునూరి నవీన్‌, మాజీ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ ఎర్రబెల్లి రాఘవరావు, సర్పంచ్‌లు గంట పద్మ, కల్వాల బాస్కర్‌రెడ్డి, కత్తి సైదులు, గుగులోతు వాలు నాయక్‌, మహేందర్‌, ఎంపీటీసీలు సోమనారాయణ, నల్లపు మౌనిక, ఎఫ్‌ఎస్‌సీ చైర్మన్‌ బొబ్బల అశోక్‌రెడ్డి, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ ముస్కు రాంబాబు, పీఏసీఎస్‌ చైర్మన్‌ మైసిరెడ్డి, నాయకులు సైదులు, వెంకన్న, ఉపేందర్‌, తదితరులు పాల్గొన్నారు.

మహిళపై కత్తితో దాడి

● కేసు నమోదు



చికిత్స పొందుతున్న సునీత

దంతాలపల్లి: మహబూబాబాద్‌ జిల్లా దంతాలపల్లి మండలం కుమ్మరికుంట్ల గ్రామంలో మహిళపై ఓ వ్యక్తి కత్తితో దాడి చేసిన ఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకోగా మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోలోజు కుమారస్వామి (వడ్రంగి) అదే గ్రామానికి చెందిన ఏరుకొండ ప్రవీణ్‌ ఇంటికి సోమవారం రేకులు వేశాడు. అదేరోజు సాయంత్రం ఏరుకొండ నరేష్‌ అనే వ్యక్తి సమారు 5 గంటల ప్రాంతంలో కత్తి పట్టుకొని కుమారస్వామి ఇంటికి వెళ్లి ప్రవీణ్‌ ఇంటికి రేకులు ఎలా వేస్తావని, నిన్ను చంపుతానని బెదిరించాడు. ఆ సమయంలో కుమారస్వామి ఇంట్లో లేకపోవడంతో అతని భార్య సునీతను విచక్షణ రహితంగా పొడిచాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు నరేష్‌ను అడ్డుకోవడానికి ప్రయత్నించగా వారికి కూడా కత్తితో బెదిరించి అక్కడి నుంచి పారిపోయాడు. గ్రామస్తుల సాయంతో సునీతను చికిత్స నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. కుమారస్వామి కుమారుడు ఏకాంబరం ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరేష్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కూచిపుడి జగదీష్‌ తెలిపారు.

కుమార్తెలకు విషమిచ్చిన తండ్రి అరెస్ట్‌



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు

పాలకుర్తిటౌన్‌: భార్యపై కోపంతో ఇద్దరు కుమార్తెలకు విషమిచ్చిన తండ్రిని పోలీసులు అరెస్ట్‌ చేశారు. ఈ ఘటనలో పెద్ద కుమార్తె చికిత్స పొందుతూ మృతి చెందగా చిన్న కుమార్తె మృత్యువుతో పోరాడుతోంది. కేసు వివరాలను మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ విశ్వేశ్వర్‌, ఎస్సై శ్రీకాంత్‌లతో కలిసి ఏసీపీ శ్రీనివాసరావు వెల్లడించారు. పాలకుర్తి మండలంలోని గూడూరు శివారు జానకీపురానికి చెందిన గుండె శ్రీను తన భార్య ధనలక్ష్మిపై కోపంతో కుమార్తెలు నాగప్రియ(9), నందిని (5)లకు విషమిచ్చాడు. అపస్మారక స్థితికి చేరిన పిల్లలను జనగామ ఆస్పత్రికి, అక్కడి నుంచి వరంగల్‌ ఎంజీఎంకు తరలించాడు. పెద్ద కుమార్తె నాగప్రియ మృతి చెందగా, రెండో కుమార్తె నందిని చికిత్స పొందుతోంది. భార్య ఫిర్యాదు మేరకు శ్రీనుపై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి



సారయ్య మృతదేహం

దుగ్గొండి: వడదెబ్బతో వ్యక్తి మృతి చెందిన సంఘటన వరంగల్‌ జిల్లా దుగ్గొండి మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలానికి చెందిన ముప్పారపు సారయ్య(67) పక్కనే ఉన్న స్వామిరావుపల్లి గ్రామంలోని ఓ రైతుకు మిర్చి ఏరడానికి మంగళవారం కూలీ పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం పని పూర్తి కాగానే అక్కడే కాసేపు సేదదీరుదామని వేప చెట్టుకింద కూర్చున్నాడు. కాసేపటికి ఒక్కసారిగా పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య పదేళ్ల క్రితం మృతి చెందగా ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

కూలీ హత్య కేసులో ఒకరి రిమాండ్‌



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణ

పెద్దవంగర: వంద రూపాయల కోసం కూలీతో ఘర్షణ పడి హత్య చేసిన యజమానిని పోలీసులు అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం డివిజన్‌ కేంద్రంలోని పోలీస్‌ స్టేషన్‌లో సీఐ సత్యనారాయణ, ఎస్సై పిల్లల రాజుతో కలిసి వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్‌ జిల్లా పెద్దవంగర మండలంలోని గంట్లకుంట గ్రామానికి చెందిన దుర్సోజు మురళి (55) కుల వృత్తి వడ్రంగి పనులతో పాటు కూలీ పనులు చేసుకుంటూ తల్లి వద్ద ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన రైతు ముత్తినేని రాములుకు ఈ నెల 6న కూలీ పనులకు వెళ్లాడు. కూలీ డబ్బులు కోసం అదే రోజు రాత్రి 9:30 గంటలకు ఇంటికి వెళ్లి అడిగాడు. రాములు డబ్బులు ఇవ్వక పోవడంతో కూలీ పనులకు వెళ్లిన మురళి మద్యం మత్తులో రాములుకు చెందిన బస్సు డోర్‌ అద్దాలను ధ్వంసం చేశాడు. దీంతో ఆగ్రహానికి గురైన రాములు తన వద్ద ఉన్న కర్రతో విచక్షన రహితంగా దాడి చేశాడు. బలమైన గాయాలు కావడంతో ఈ 7న మురళి మృతి చెందాడు. తల్లి ఐలమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేశారు. విచారణ అనంతరం ముత్తినేని రాములుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడు..



వెంకటేశ్‌ మృతదేహం

కాటారం: జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం వీరాపూర్‌ గ్రామానికి చెందిన బద్ది మధునక్క, రాజయ్య కుమారుడు వెంకటేశ్‌ (13) అనే బాలుడు మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి సమీపంలోని చెరువు వద్ద గల చెట్టు కింద వెంకటేశ్‌ విఘతజీవిగా పడి ఉన్నాడు. ఇది గమనించిన పలువురు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా వెంకటేశ్‌ మృతి చెందినట్లు గుర్తించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహదేవపూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే వెంకటేశ్‌ ఉదయం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ట్రాక్టర్‌పై వెళ్లాడని, బాలుడి తల భాగంలో గాయమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ట్రాక్టర్‌ పైనుంచి పడి మృతి చెంది ఉంటాడా లేక వేరే ప్రమాదం ఏమైన జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కాలికి నిప్పంటించిన ఘటనలో యువకుడు..

స్టేషన్‌ఘన్‌పూర్‌: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గట్టు మనూష్‌ అనే తొమ్మిదేళ్ల బాలుడి కాలికి నిప్పు పెట్టిన ఘటనలో నిందితుడు జిట్టె రాజును మంగళవారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ రాఘవేందర్‌ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈనెల 7న కొత్తపల్లిలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో గట్టు మనూష్‌ అనే బాలుడు ఆడుకుంటుంటే అదే గ్రామానికి చెందిన రాజు, అభినవ్‌లు వెళ్లి బాలుడి కాలికి కాటన్‌ కట్టి నిప్పంటించారు. దీంతో బాలుడి తండ్రి సతీష్‌ పోలీసులకు ఫిర్యాదు చేయడంలో రాజుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

పోలీసుల అదుపులో పోకిరీలు!

● దాడిపై సర్వత్రా విమర్శలు
● కఠినంగా శిక్షించాలని స్థానికుల డిమాండ్‌



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వినోద్‌

కాశిబుగ్గ: వరంగల్‌ 19వ డివిజన్‌ వివేకానందకాలనీలో ఆదివారం రాత్రి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న యువకుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన నిందితులు ఇంతేజార్‌గంజ్‌ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. వివేకానందకాలనీకి చెందిన సిరివెల్ల వినోద్‌ ఓ సిటీలోని ఫంక్షన్‌కు వెళ్లి ఆదివారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో ఇంటికి వెళ్తున్న క్రమంలో కాశిబుగ్గకు చెందిన ముగ్గురు పోకిరీలు బైక్‌పై అతివేగంగా పక్క నుంచే వెళ్లడంతో వినోద్‌ జడుసుకున్నాడు. జర చూసుకొని పోవాలంటూ వారితో అనడంతో వారు కోపోద్రిక్త వినోద్‌ను తీవ్రంగా కొట్టడంతో కాళ్లు, చేయికి తీవ్ర గాయాలయ్యాయి. వినోద్‌ అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో చనిపోయినట్లు భావించి వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటన జరిగిన వెంటనే వినోద్‌ అన్న హరిప్రసాద్‌ 108 ద్వారా ఎంజీఎంకు తరలించారు. అమాయకుడైన వినోద్‌ రెండు కాళ్లు, కుడి చేయి విరిగేవిధంగా కొట్టడంతో కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోకిరీలను కేసు నుంచి తప్పించేందుకు అధికార పార్టీ నాయకులు ప్రయత్నించడంపై తీవ్రంగా ఖండిస్తున్నారు. పోలీసులు రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించక పోవడంతోనే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

వరంగల్‌లో టూరిజం అభివృద్ధి

● సదరన్‌ ట్రావెల్స్‌ ప్రారంభోత్సవంలో మంత్రి ఎర్రబెల్లి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి దయాకర్‌రావు, చీఫ్‌ విప్‌ వినయ్‌భాస్కర్‌, సదరన్‌ ట్రావెల్స్‌ ప్రతినిధులు

నయింనగర్‌: వరంగల్‌లో టూరిజం, ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందిందని, సదరన్‌ ట్రావెల్స్‌ సేవలు ఇక్కడ కూడా అవసరమని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం నయింనగర్‌ పుష్పాంజలి కాంప్లెక్స్‌లో సదరన్‌ ట్రావెల్స్‌ కార్యాలయాన్ని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చీఫ్‌ విప్‌ దాస్యం వినయ్‌భాస్కర్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ టూరిజం, ట్రావెల్స్‌ రంగంలో సదరన్‌ ట్రావెల్స్‌కు మంచి పేరుందని, 50 ఏళ్లుగా ఈ సంస్థ దేశ విదేశాల్లో సేవలందిస్తుందన్నారు. యాత్రికులకు దేశ వ్యాప్తంగా మంచి ప్యాకేజీలు ఉన్నాయన్నారు. సదరన్‌ గ్రూప్‌ జేఎండీ ఆళపాటి ప్రవీణ్‌కుమార్‌ మాట్లాడుతూ సదరన్‌ గ్రూప్‌ కంపెనీ అత్యంత ప్రతిష్టాత్మకమైన సదరన్‌ గ్రాండ్‌ కాశీని ప్రధాని మోదీ మార్చి 28న ప్రారంభించారని తెలిపారు. వరంగల్‌ నూతన కార్యాలయంలో దేశీయ, అంతర్జాతీయ విహార యాత్రలు, తీర్థయాత్రలను, విమాన టికెట్లు, ప్రపంచ వ్యాప్తంగా హోటల్‌ రిజర్వేషన్లు, వీసా సేవలు అందిస్తుందని తెలిపారు. వచ్చే ఏడాదిలో సంస్థ మరో 50 బ్రాంచీలతో విస్తరించే ప్రక్రియలో ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎండీలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.